సాక్షి
కుమురం భీం

ఆదివారం । 10 । డిసెంబర్ । 2023

వేధింపులా.. 'సాహస్'మే అస్త్రం

వేధింపులపై మహిళలు ఫిర్యాదు చేసేం దుకు మహిళా భద్రతా విభాగం సాహస్ పోర్టల్‌ను తెచ్చింది. 73311 94540 నంబర్‌లో ఫిర్యాదు చేయాలని సూచించింది.

8లో▸



కేసీఆర్ ఫొటో తొలగింపు

దహెగాం: రేవంత్‌రెడ్డి ఇటీవల సీఎంగా బాధ్యతలు చేపట్టారు. దీంతో మండల కేంద్రంలో 108 సిబ్బంది అంబులెన్స్‌పై ఉన్న కేసీఆర్ ఫొటోను శనివారం తొలగించారు.

గరిష్టం/కనిష్టం
29.0 /16.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి పెరుగుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.


ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు


ఎమ్మెల్యే గడ్డం వినోద్


ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి


ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


ఎమ్మెల్యే కోవ లక్ష్మి


ఎమ్మెల్యే అనిల్ జాదవ్

..అనే నేను

ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికైన వారంతా ఎమ్మెల్యేలుగా శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీలో ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు. నిర్మల్, ముధోల్, సిర్పూర్, ఆదిలాబాద్ నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్, పాల్వాయి హరీష్‌బాబు, పాయల్ శంకర్‌లు ప్రమాణ స్వీకారానికి దూరంగా ఉన్నారు.

న్యూస్‌రీల్

భాగ్యలక్ష్మి ఆలయంలో 'పాల్వాయి' పూజలు


కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యేలతో కలిసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్

కాగజ్‌నగర్‌టౌన్: హైదరాబాద్‌లోని చార్మినార్ వద్ద గల భాగ్యలక్ష్మి అమ్మవారిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి శనివారం సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గన్‌పార్క్‌లోని అమర వీరుల స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించే కార్యక్రమంలోనూ పాల్గొన్నారు.

20నుంచి ఆటల పోటీలు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బెల్లంపల్లి ఏరియా ఆధ్వర్యంలో వివిధ ఆటలపోటీలు నిర్వహించనున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి తిరుపతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న మాదారం డిస్పెన్సరీ ఎదుట, 21న గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో దీపాలంకరణ పోటీలు, హరిత గృహాల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఈనెల 18వ తేదీలోపు పర్సనల్ డిపార్ట్‌మెంట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా భీమన్న స్టేడియంలో స్టాళ్ల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల వారు 18వ తేదీలోపు దరఖాస్తులను పర్సనల్ డిపార్ట్‌మెంట్ కార్యాలయంలో అందించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు


విద్యార్థులతో ప్రిన్సిపాల్ అబ్దుల్ కలీల్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్‌స్కూల్ విద్యార్థులు టెన్నికాయిట్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ కలీల్, పీడీ తిరుపతి తెలి పారు. వీరిని పాఠశాల ఆవరణలో శనివారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 7, 8తేదీల్లో నిర్మల్‌లో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్‌స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో శ్రీవర్షిణి, హరి చందన ఉత్తమ ప్రతిభ కనబర్చారని తెలిపారు. అలాగే ఈ నెల 6న బెల్లంపల్లిలో జరిగిన బేస్ బాల్ అండర్-17 బాలుర విభాగంలో విద్యార్థి సాయిప్రసాద్ ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు.

మహా ప్రయాణం

- జిల్లాలో 'మహాలక్ష్మి' ప్రారంభం
- వినియోగించుకున్న మహిళలు
- సంబురంగా ఉచిత ప్రయాణం
- జిల్లాలో 76 బస్సు సర్వీసులు


జిల్లా కేంద్రంలో జెండా ఊపి పథకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, చిత్రంలో అధికారులు, నాయకులు

ఆసిఫాబాద్/కౌటాల/కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత రవాణా సౌకర్యాన్ని శనివారం రాష్ట్రంతో పాటు జిల్లాలో అమలు చేసింది. మధ్యాహ్నం 2గంటల నుంచి ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని జిల్లాలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం చేశారు. ఉచిత ప్రయాణం కొత్త అనుభూతినిచ్చిందని మహిళా ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉచిత ప్రయాణం కారణంగా ఆర్టీసీ బస్టాండ్లలో మహిళలు రద్దీగా కనిపించారు. బస్సుల్లోనూ పురుషులకంటే మహిళలే అధికంగా ప్రయాణం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం నిర్ణయం చాలా బాగుందని, కానీ.. బస్టాండ్లలో మరుగుదొడ్లు, తాగునీటి వసతి సరిగాలేక ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి శనివారం మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించగానే కాగజ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మహిళా ప్రయాణికులు ఆనందంగా సేవలు వినియెగించుకున్నారు. ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలోని కాగజ్‌నగర్ బస్టాండ్ నుంచి వివిధ రూట్లలో వెళ్లడానికి సిద్ధంగా ఉన్న పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు, యువతులు ప్రయాణాలు సాగించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటామని పేర్కొన్నారు. మహిళలపై గౌరవం ఉంచిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. మరో వైపు ప్రస్తుతం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని, రెండుమూడ్రోజుల్లో '0' టికెట్లు జారీ చేస్తామని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. సిర్పూర్, కౌటాల, బెజ్జూర్, దహెగాం, కాగజ్‌నగర్ మండలాల్లోని ఆయా ప్రాంతాలకు మహిళలు బస్సుల్లో బయలుదేరి వెళ్లారు.

కార్డు అడగలే.. టికెట్ ఇవ్వలే..

తొలిరోజు కండక్టర్లు బస్సులో ఎంతమంది మహిళలు ఎక్కారని నోట్ చేసుకున్నారు. మహిళలను ఎలాంటి గుర్తింపు కార్డులు కూడా అడగలేదు. టికెట్లూ ఇవ్వలేదు. వారంపాటు గుర్తింపు కార్డు లేకుండా మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చని ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. త్వరలో జీరో టికెట్లు ఇస్తామని అధికారులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో 76 బస్సు సర్వీసులున్నాయి. ఇందులో రెండు రాజధాని, 14 సూపర్ లగ్జరీ, రెండు డీలక్స్, నాలుగు ఎక్స్‌ప్రెస్‌లు, 28 పల్లెవెలుగు, 28 ప్రైవేట్ పల్లె వెలుగు బస్సులున్నాయి. డిపోలో 350 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం ప్రతిరోజూ ఐదు రూట్లతో 71 షెడ్యూళ్లు, 32 వేల కిలో మీటర్లు తిరుగుతూ సుమారు 22వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నారు. డిపోకు ప్రతిరోజూ సుమారు రూ.14 లక్షల ఆదాయం సమకూరుతుందని అధికారులు పేర్కొన్నారు. కాగా, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కిటకిటలాడిన బస్సులు

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడాయి. జిల్లా కేంద్రం నుంచి సమీప గ్రామాలకు చెందిన మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు ఆసక్తి చూపారు. కొంతమంది బస్సుల కోసం నిరీక్షించారు. జిల్లా కేంద్రం నుంచి నిత్యం మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్, ఉట్నూర్, వాంకిడితో పాటు పలు ప్రాంతాలకు ఉద్యోగులు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. వీరికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది.


కాగజ్‌నగర్‌లో బస్సు ఎక్కుతున్న మహిళలు

సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

మహిళలు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే సూచించారు. శనివారం మధ్యాహ్నం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.10లక్షల బీమా పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ఆర్టీసీ డీఎం శ్రీధర్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బస్సులో కూర్చుని బస్టాండ్ వరకు ప్రయాణించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో తుకారాం, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాం నాయక్, రాజేంద్ర కుమారి, మంగ, సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సుల సంఖ్య పెంచాలి



కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం సంతోషం. పేదలకు లబ్ధి చేకూరేలా జిల్లాలోని అన్ని గ్రామాలకు బస్సులు అందుబాటులో ఉంచాలి. బస్సుల సంఖ్య కూడా పెంచి సౌకర్యాలు మెరుగుపర్చాలి.

– రాజేశ్వరి, బెండార, వాంకిడి మండలం

సీఎంకు ధన్యవాదాలు



అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు. ఉచిత ప్రయాణంతో పేద మహిళలను ఎంతగానో ఆర్థికంగా ఆదుకున్నట్లవుతుంది. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం సంతోషంగా ఉంది. కానీ, ఈ భారం పురుష ప్రయాణికులపై వేసి విమర్శల పాలు కావద్దు.

– మాయ, గృహిణి

సంతోషంగా ఉంది



ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని త్వరగా అమలు చేయడం సంతోషంగా ఉంది. మాలాంటి పేద విద్యార్థినులకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని నిరంతరంగా కొనసాగించాలి. పేదలకు ఈ పథకం లాభదాయకంగా ఉంటుంది.

– మైనిక, విద్యార్థిని

ఉచితం.. పైగా సురక్షితం



ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం. పైగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం హర్షణీయం. నేను ఈ రోజు బస్సులో ఉచితంగా ప్రయాణించిన. టికెట్ డబ్బులు అడగలేదు. గుర్తింపు కార్డు కూడా అడగలేదు. ఉచితంగా బస్సులో ప్రయాణించడం సంతోషంగా ఉంది.

– మంగళ, ముత్తంపేట్

పేదలకు ఎంతో మేలు



కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం పేదలకు ఎంతో లాభం చేకూరుతుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు పింఛన్ రూ.4వేలకు పెంచాలి. అన్ని గ్రామాలకు బస్సులు పంపుతూ గ్రామీణులకు అందుబాటులో ఉంచాలి.

– ఎర్రశాంత, ఖైర్‌గాం, రెబ్బెన మండలం

పథకం బాగుంది



ఆర్టీసీ బస్సులో టికెట్ లేకుండా ప్రయాణించడం ఇదే మొదటి సారి. టికెట్ లేకుండా కాగజ్‌నగర్ వెళ్లడం కొత్త అనుభూతినిచ్చింది. మహిళల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా బాగుంది. అలాగే ప్రభుత్వం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాల్లో కనీస సౌకర్యాలు కల్పించి ప్రయాణికుల ఇక్కట్లు తీర్చాలి.

– సుశీల, కౌటాల

అన్ని బస్సుల్లో అనుమతించాలి



కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం సంతోషం. కానీ, రాజధాని, సూపర్ లగ్జరీల్లో కూడా అవకాశం కల్పించాలి. ఉచిత ప్రయాణంతో హైదరాబాద్, ఇతర దూరప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బందవుతుంది. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకోకుండా చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు.


– దుర్గమ్మ, గృహిణి

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


అవగాహన కల్పిస్తున్న సీనియర్ అకౌంట్స్ అధికారి

రెబ్బెన(ఆసిఫాబాద్): మహిళా భద్రత చట్టాలపై మహిళా ఉద్యోగులంతా అవగాహన కలిగి ఉండాలని బెల్లంపల్లి జనరల్ మేనేజర్ కార్యాలయ సీనియర్ అకౌంట్స్ అధికారి సుద్దాల సౌమ్య సూచించారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగుల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురయ్యే మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలను వివరించారు. మహిళలకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం 2013, డిసెంబర్ 9న ప్రత్యేక చట్టం తీసుకువచ్చిందని తెలిపారు. దీంతో మహిళా ఉద్యోగులు స్వేచ్ఛగా విధులు నిర్వహించేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. మహిళలను వేధింపులకు గురి చేసే వారిని ఎలా ఎదుర్కోవాలో వివరించారు. ఈ సందర్భంగా జీఎం కార్యాలయంలో పని చేస్తున్న మహిళా ఉద్యోగుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు.

ఇక పల్లె పోరు



- పంచాయతీ ఎన్నికలకు కసరత్తు
- జిల్లాలో 335 గ్రామపంచాయతీలు
- ఇప్పటినుంచే సిద్ధమవుతున్న నేతలు

ఆసిఫాబాద్‌అర్బన్: వచ్చే నెల నుంచి మరో ఆర్నెళ్లపాటు వరుసగా ఎన్నికలు జరగనున్నాయి. 2023 – 24ను ఎన్నికల సంవత్సరంగా మారనుంది. జనవరి 31తో గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. వచ్చే జనవరి నుంచి పల్లెల్లో పంచాయతీ సమరం షురూ కానుంది. ఫిబ్రవరి 2న కొత్త పాలకవర్గాలు కొలువుదీరాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి డీపీవోలకు ఆదేశాలు అందాయి. దీంతో అధికారులు కసరత్తు చేస్తున్నారు. పోలింగ్ ఎప్పుడు నిర్వహిస్తారనే విషయంలో త్వరలోనే ప్రభుత్వం నుంచి స్పష్టత రానుంది.

కసరత్తు ప్రారంభం

జిల్లాలో 334 గ్రామపంచాయతీలున్నాయి. ఆసిఫాబాద్‌ను నూతన మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు రావడంతో పట్టణంలోని రాజంపేట నూతన గ్రామపంచాయతీగా ఏర్పడనుంది. దీంతో గ్రామపంచాయతీల సంఖ్య 335కు చేరింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేయగా వాటికి అదనంగా గ్రామాల వారీగా ఇంకా ఎన్ని బూత్‌లు అవసరమవుతాయనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఇటీవల ఒక్కో గ్రామంలో రెండు నుంచి నాలుగు బూత్‌లు ఏర్పాటు చేశారు. అయితే పంచాయతీ ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా బూత్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఇంకా ఎన్ని పోలింగ్ స్టేషన్లు అవసరం, ఎంతమంది సిబ్బంది అవసరం లాంటి వివరాలు సేకరిస్తున్నారు. ఓటర్లను కూడా వార్డులవారీగా విభజించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

సిద్ధమవుతున్న నేతలు

జిల్లాలో 335 గ్రామపంచాయతీలుండగా వంద శాతం ఎస్టీ జనాభా ఉన్న పంచాయతీలను ఆ సామాజిక వర్గానికి రిజర్వ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇదివరకు 2,864 వార్డులుండగా, నూతనంగా పెరిగిన రాజంపేట పంచాయతీతో ఆ సంఖ్య 2,874కు చేరింది. అందుకు అనుగుణంగా పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటికే ఆశావాహులు పోటీకి సిద్ధమవుతున్నారు. కులసంఘాల వారీగా మంతనాలు ప్రారంభించి ఓటర్లకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు.

మండలాల వారీగా పంచాయతీలు

మండలం	జీపీల సంఖ్య
ఆసిఫాబాద్	27
జైనూర్	26
కెరమెరి	31
తిర్యాణి	29
వాంకిడి	28
సిర్పూర్(యూ)	15
లింగాపూర్	14
రెబ్బెన	24
కాగజ్‌నగర్	28
పెంచికల్‌పేట్	12
సిర్పూర్(టీ)	16
దహెగాం	24
చింతలమానేపల్లి	19
కౌటాల	20
బెజ్జూర్	22
మొత్తం	335

'ప్రజలకు అందుబాటులో ఉంటా'


మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్

ఆసిఫాబాద్‌అర్బన్: ఎన్నికల్లో ఓడినా ప్రజలకు అండగా ఉంటానని కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ పేర్కొన్నారు. అతి తక్కువ సమయంలోనే నియోజకవర్గ ప్రజలు తనకు అండగా నిలిచారని తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఓడిపోవడం బాధాకరమని, నైతికంగా కాంగ్రెస్ విజయం సాధించిందని పేర్కొన్నారు. గెలిచిన పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడి డబ్బు, మద్యంతో ఓటర్లను ప్రలోభపెట్టి, భయపెట్టి ఓట్లు వేయించుకుందని ఆరోపించారు. 10 ఏళ్లు అధికారంలో ఉన్న నాయకులు నియోజకవర్గంలో కనీస వసతులు కల్పించలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజలు ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే కొత్త ప్రభుత్వం రెండింటిని ప్రారంభించిందని తెలిపారు. మిగతావి కూడా త్వరలోనే అమలవుతాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆసిఫాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. నాయకులు గుండా శ్యాం, చరణ్, సలీం, లోకేశ్, కళావతి, రాపర్తి మురళి, ఇరుకుల మంగ, రాజేంద్రకుమారి, నారాయణ, జక్కయ్య తదితరులున్నారు.

క్లుప్తంగా

ఐఎన్టీయూసీ మేనిఫెస్టో విడుదల



విడుదల చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మందమర్రిరూరల్(చెన్నూర్): ఈ నెల 27న జరగనున్న సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో భాగంగా ఐఎన్టీయూసీ మేనిఫెస్టో విడుదల చేశారు. శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా మేనిఫెస్టో విడుదల చేసినట్లు ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ తెలిపారు. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్టీయూసీ గెలుపుకోసం సింగరేణి కార్మికులు సహకరించాలని శ్రీధర్‌బాబు కోరినట్లు జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా 'అరిగెల'

మంచిర్యాలక్రైం: కాంగ్రెస్ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా అరిగెల తిరుమల్‌రావ్‌ను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆ కాపీని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావ్ శనివారం అందజేశారు.

హత్యపై పోలీసుల విచారణ



విచారణ చేపడుతున్న సీఐ

బెజ్జూర్(సిర్పూర్): మండలంలోని చిన్నసిద్దాపూర్‌లో శుక్రవారం జరిగిన ఆదె పురుషోత్తం హత్యపై శనివారం కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కౌటాల సీఐ సాదిక్‌పాషా, బెజ్జూర్ ఎస్సై విక్రం విచారణ చేపట్టారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. గ్రామానికి చెందిన నిందితుడు టాక్రె వసంత్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

మందమర్రిరూరల్(చెన్నూర్): అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పొన్నారం గ్రామానికి చెందిన ముప్పిడి తిరుపతి(37) ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తూ భార్య శ్రీనిధి, ఇద్దరు కుమారులతో కలిసి శ్రీరాంపూర్‌లో నివాసం ఉంటున్నాడు. ఓటు వేసేందుకు ఇటీవల పొన్నారం వచ్చాడు. ఆరోగ్యం బాగా లేకపోవడంతో అప్పటి నుంచి తల్లి శంకరమ్మ వద్దే ఉన్నాడు. మృతుని తల్లి శనివారం ఉదయం కూలి పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని విగత జీవిగా కనిపించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వేధింపులా..! సాహస్‌మే అస్త్రం

- మహిళల భద్రతపై ప్రత్యేక పోర్టల్
- సమస్యలు చెప్పుకునేందుకు 'గెట్ హెల్ప్' ఆప్షన్

సాక్షి, మంచిర్యాలడెస్క్: పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగులు లైంగిక వేధింపులు, ఇతర సమస్యలూ ఎదుర్కొంటున్నారు. కొందరు ధైర్యంగా ఫిర్యాదు చేయడమో.. ఎదిరించడమో చేస్తుండగా మరికొందరు మౌనంగా భరిస్తూ మానసికంగా కుమిలిపోతున్నారు. తాజాగా మంచిర్యాల జిల్లా అటవీశాఖలో మహిళా బీట్ ఆఫీసర్ ఉన్నతాధికారుల వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం చేసింది. పని ప్రదేశాల్లో వేధింపులు, సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు మహిళా భద్రతా విభాగం ఇటీవల 'సాహస్' పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. పని ప్రదేశంలో మహిళా ఉద్యోగుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలు, లైంగిక వేధింపులపై ఎలా ఫిర్యాదు చేయాలి, న్యాయ సహాయం ఎలా పొందాలి అనే వివరాలు పొందుపర్చారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు 7331194540 నంబరులో ఫిర్యాదు చేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో మినహా మిగతా రోజుల్లో సహాయం అందిస్తారు. ఫోన్ ద్వారా గానీ వాట్సాప్ ద్వారా గానీ సంప్రదించవచ్చు.

'గెట్ హెల్ప్'

పోర్టల్‌లో గెట్ హెల్ప్ ఆప్షన్ ద్వారా బాధితులు గానీ వారి సంబంధీకులు గానీ సలహాలు, సూచనలు పొందవచ్చు. సమస్యను తెలియజేస్తే సంబంధిత ప్రముఖ నిపుణులు ఆయా సమస్యలు, ఇబ్బందులపై ఎలా ముందుకెళ్లాలనే అంశంపై వివరిస్తారు. వ్యక్తిగతంగా గానీ సంస్థల పరంగా గానీ ఎదురవుతున్న ఇబ్బందులను వివరిస్తే సవివరమైన సమాధానం లభిస్తుంది. న్యాయ, చట్టపరంగా ఉన్న అన్ని సానుకూల అంశాలను తెలియజేస్తారు. భద్రత దృష్ట్యా ఫిర్యాదుదారు, సంప్రదించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారు.



పవర్ ప్లాంటులో కార్మికులతో మాట్లాడుతున్న ఫిర్యాదుల కమిటీ చైర్మన్ ఆశ

యాజమాన్యం దృష్టికి తేవాలి

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో ఉన్న ఆయా ప్రాంతాల్లో పని చేస్తున్న మహిళా కార్మికులు లైంగిక వేధింపులకు గురైన యాజమాన్యం దృష్టికి తీసుకు రావాలని లైంగిక వేధింపుల నివారణ, ఫిర్యాదుల కమిటీ ఎస్టీపీపీ చైర్‌పర్సన్ ఆశ తెలిపారు. శనివారం పవర్‌ప్లాంటులో మహిళా కార్మికులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి మహిళలపై లైంగిక వేధింపుల నిషేధిత నివారణ చట్టం -2013పై అవగాహన కల్పించారు. మహిళలకు ఎలాంటి సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకు రావాలని అన్నారు. మహిళా వర్కర్లకు చట్టంపై పూర్తిగా వివరించారు. ఫిర్యాదు చేస్తే తక్షణమే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్‌వోటీ జీఎం కొండా వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇదీ పోర్టల్

https:// womensafetywing. telangana. gov. in/ sahas

ధైర్యంగా ఫిర్యాదు చేయండి



ప్రభుత్వ కార్యాలయంలో గానీ ప్రైవేటు సంస్థల్లో పని చేసే చోట ఎవరైనా లైంగికంగా వేధింపులకు గురి చేస్తే లోకల్ కంప్లయింట్ కమిటీ(ఎల్‌సీసీ)ని సంప్రదించాలి. వివరాలను గోప్యంగా ఉంచుతాం. న్యాయం జరిగేలా చర్యలు చేపడుతాం. ఈ సేవలను ఉచితంగా అందిస్తాం. 2013సంవత్సరం నుంచి ఈ కమిటీ పని చేస్తుంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కమిటీలు వేయడం జరిగింది. వేధింపులను తమలోనే దాచుకుని మానసికంగా కుంగిపోకుండా ధైర్యంగా ఉండాలి. ఎల్‌సీసీపై అవగాహన లేనిపక్షంలో మహిళా సాధికారత కేంద్ర మరియు సఖీ కేంద్రం, మహిళా శిశు సంక్షేమ శాఖను సంప్రదించవచ్చు. గత ఆరు నెలల క్రితం ఆదిలాబాద్‌లోని ట్రెజరీ కార్యాలయంలో ఓ కేసు నమోదు చేశాం.

– సరిత, లోకల్ కంప్లయింట్ కమిటీ చైర్‌పర్సన్, ఆదిలాబాద్

సమాచారం ఇవ్వండి



మహిళా ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ మహిళలు వేధింపులకు గురైతే వెంటనే షీ టీమ్ పోలీసులకు సమాచారం ఇవ్వండి. షీ టీమ్స్ భద్రత కల్పిస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేసే మహిళలకు భద్రత కల్పించడమే లక్ష్యంగా పని చేస్తోంది. సమాచారం ఇచ్చిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతాం. వేధింపులకు గురైన మహిళలు 100 డయల్, షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 6303923700కు ఫిర్యాదు చేయవచ్చు.

– హైమ, షీ టీమ్ ఎస్సై, మంచిర్యాల

భరోసా కేంద్రాలు..



ప్రభుత్వం మహిళల భద్రత కోసం భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. ప్రతీ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పని చేస్తున్న మహిళలందరూ కలిసి కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి. మహిళలు కుటుంబాలు, ఇతర స్థలాల్లో తోటి ఉద్యోగులతో వేధింపులకు గురైతే భద్రత సెంటర్లు, న్యాయసేవాధికార సంస్థల్లో ఉచితంగా న్యాయసలహాలు తీసుకునే అవకాశం ఉంది. షీ టీమ్స్, భరోసా కేంద్రాల ద్వారా సమస్య పరిష్కరించుకునే అవకాశం ఉంది.

– సుంకరి శైలజ, న్యాయవాది, మంచిర్యాల

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయురాలు

- చేయి వాపెక్కడంతో ఆస్పత్రిలో చికిత్స
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

రెబ్బెన(ఆసిఫాబాద్): మ్యాథ్స్ సరిగా చేయడంలేదని ఉపాధ్యాయురాలు విద్యార్థిని కొట్టడంతో గాయాలైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని గోలేటి విలేజ్‌లో గల ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న టేకం గంగు మ్యాథ్స్ సరిగా చేయడం లేదని సీఆర్టీగా పనిచేస్తున్న మ్యాథ్స్ ఉపాధ్యాయురాలు భావన గురువారం విద్యార్థిని కొట్టడంతో చేయి వాపెక్కింది. విషయం బయటకు రాకుండా శుక్రవారం ఆయింట్‌మెంట్ తీసుకువచ్చి రాసినప్పటికీ తగ్గక పోవడంతో శనివారం బెల్లంపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఈ విషయమై పాఠశాల హెచ్‌ఎం సోమయ్యను వివరణ కోరగా ఉపాధ్యాయురాలు విద్యార్థిని కొట్టిన మాట వాస్తవమేనన్నారు. విద్యార్థి చేయి గతంలోనే విరిగిందని, అదే ప్రదేశంలో కొట్టడంతో వాపెక్కిందన్నారు.

లక్ష దీపోత్సవానికి ఏర్పాట్లు ముమ్మరం



ఏర్పాట్లు చేయిస్తున్న నిర్వాహకులు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 11న కార్తీక మాసం చివరి సోమవారం సాయంత్రం 5:45 గంటలకు లోక కల్యాణార్థం లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, మాజీ సర్పంచ్ గొడిసెల బాపురెడ్డి తెలిపారు. వేద పండితులు రామనాథ శర్మ నేతృత్వంలో శివ పార్వతుల కల్యాణం, లక్ష దీపారాధన మహోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. హైదరాబాద్ కళాకారులచే భరతనాట్యం, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

గెలిచే సంఘంతోనే సింగరేణి భవిష్యత్

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచే సంఘంపై సంస్థ భవిష్యత్ ఆధారపడి ఉందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శనివారం ఎస్సార్పీ 3, 3ఏ గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. పదకొండేళ్లుగా టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉండి ప్రభుత్వానికి, యజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికులకు తీరని అన్యాయం చేసిందన్నారు. సంస్థ నిధులను ప్రభుత్వానికి మళ్లించి ఆర్థికంగా బలహీనపరిచారని ఆరోపించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు ఏఐటీయూసీలో చేరగా వారికి కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శులు మోత్కూరి కొమురయ్య, ఎస్కే బాజీసైదా, ఉపాధ్యక్షులు కొట్టె కిషన్‌రావు, పిట్ సెక్రటరీ మురళి చౌదరి, తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పుతున్న సీతారామయ్య

'మహాలక్ష్మి' అమలుపై సంబరాలు

బెల్లంపల్లి: మహాలక్ష్మి పథకం అమలుపై బెల్లంపల్లిలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. కాంటా చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సెక్కి ప్రయాణికులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రావడంవల్లే ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కలిగిందన్నారు. అంతకు ముందు ఆర్టీసీ బస్సుకు ఫ్లెక్సీలు కట్టి ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మల్లయ్య, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రొడ్డ శారద, కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు నాతరి స్వామి, నాయకులు రామగిరి శ్రీనివాస్, లెంకల శ్రీనివాస్, మంతెన మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.



విజయ సంకేతం చూపిస్తున్న నాయకులు

మామిడి రైతుల్లో 'మిచాంగ్' గుబులు

- వాతావరణంలో మార్పులతో రాలుతున్న పూత
- ఆందోళన చెందుతున్న రైతులు

ఏటా మామిడి రైతులు ఏదో ఒక విధంగా నష్టపోతూనే ఉన్నారు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో మామిడి చెట్లకు పూత సరిగా రాక పోవడం, వచ్చిన పూత నిలవక పోవడం, పిందెలు రాలి పోవడం, అకాల వర్షాలు, గాలిదుమారాలతో కాయలు నేలరాలి పోతుండడంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు.



భీమారం సమీపంలోని మామిడి తోట

చెన్నూర్‌రూరల్: జిల్లా వ్యాప్తంగా సుమారు 18 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో రైతులు మామిడి తోటలను సాగు చేస్తున్నారు. భీమారం, జైపూర్, కోటపల్లి, బెల్లంపల్లి, నెన్నెల, ఆవుడం, చిత్తాపూర్, ఖాజిపల్లి, బూరుగుపల్లి, దాంపూర్‌లతో పాటు చెన్నూర్ మండలంలోని ఎర్రగుంటపల్లి, కొమ్మెర, ఆస్నాద, బుద్దారం, సంకారం, కన్నెపల్లి, సుద్దాల, కమ్మరిపల్లి, గంగారం తదితర గ్రామాలలో ఎక్కువ మొత్తంలో మామిడి తోటలు సాగు చేస్తున్నారు. వారంతా మామిడి దిగుబడులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. డిసెంబర్ మాసం నుంచి మామిడి చెట్లకు పూత ప్రారంభమవుతుంది. జనవరి మాసంలో పూత కొద్దికొద్దిగా పిందెలుగా మారి ఫిబ్రవరిలో పూర్తిస్థాయిలో పిందెలుగా ఏర్పడతాయి. కానీ ఇటీవల మిచాంగ్ తుపాన్ ప్రభావంతో ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్నాయి. వారం రోజులుగా చల్లగా ఉంటోంది. దీనికి తోడు కొన్నిచోట్ల చిరుజల్లులు పడటంతో ఇప్పటికే వచ్చిన పూత రాలిపోయింది. అంతేకాకుండా చలి తీవ్రత కూడా పెరగడంతో పూత రాలుతోంది. మామిడిపూత రాలుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం ఇలాగే ఉంటే పూత మొత్తం రాలి పోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. మామిడి చెట్లకు పూత వచ్చేందుకు ఇప్పటికే వేలాది రూపాయలు వెచ్చించి మందులు పిచికారీ చేశామని రైతులు పేర్కొంటున్నారు.

గతేడాది టెంకపురుగుతో నష్టం

గతేడాది వాతావరణం సహకరించి మామిడి చెట్లకు కాయలు బాగానే కాసాయి. కానీ చివరిదశలో కాయ లోపల టెంకలో పురుగు వచ్చి రైతులు తీవ్రంగా నష్ట పోయారు. పంట దిగుబడి చేతికి వచ్చినా పురుగు రావడంతో కాయలను అమ్మలేక పోయారు. ఈ ఏడాది ఎలా ఉంటుందోనని ఇప్పటి నుంచే ఆందోళన చెందుతున్నారు.

పూత రాలుతోంది



వాతావరణంలో మార్పులు, తుపాన్ కారణంగా చిరుజల్లులు కురవడం, చలి పెరగడంతో వచ్చిన మామిడి పూత రాలిపోతోంది. ఈ నెల చివరి వరకైనా మళ్లీ పూత పూర్తిస్థాయిలో వస్తే బాగుంటుంది. వాతావరణం సహకరిస్తేనే పంట దిగుబడి వస్తుంది.

– మడె అర్జయ్య, మామిడి రైతు, సంకారం

ఆందోళన చెందవద్దు



తుపాన్ ప్రభావంతో వాతావరణంలో మార్పులు ఏర్పడి వచ్చిన కొద్దిపాటి పూత రాలిపోయింది. కానీ ఈ నెల చివరి వరకు పూర్తిస్థాయిలో పూత వస్తుంది. రైతులు ఆందోళన చెందవద్దు. తేనె మంచు, పురుగు ఆశిస్తే ఇమిడాక్లోప్రిడ్, లామ్డాసైహలోత్రిన్ మందులు పిచికారీ చేయాలి. తెగుళ్లు వస్తే డైఫ్నోకొనజోల్, వాలిడామైసిన్ లేదా హెక్సాకొనజోన్ వంటి మందులు పిచికారీ చేయాలి.

– తిరుపతి, హెచ్‌వో, చెన్నూర్

చికిత్స పొందుతూ మహిళ మృతి



అనంతబాయి (ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): ఈ నెల 7న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మండలం లోని నంబాల గ్రామానికి చెందిన రత్నం అనంత బాయి (48) చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. నాలుగేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న అనంతబాయికి పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఆరోగ్యం కుదుట పడకపోవడంతో మనస్థాపానికి గురైంది. ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా గమనించిన భర్త దేవాజీ కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి వైద్యులు మంచిర్యాలకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి సోదరుడు డోంగ్రి పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడు మృతి



శంకర్ (ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: మద్యం మత్తులో పురుగుల మందు తాగి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని సాలెగూడలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చాపిడి రావుజీ, ప్రవీణ దంపతుల కుమారుడు చాపిడి శంకర్ (24) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పత్తి మందు తాగాడు. కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజేశ్వర్ తెలిపారు.

లబ్ధిదారులతో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్

బెల్లంపల్లి: ప్రభుత్వ పథకాలు పొందిన లబ్ధిదారులతో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా బెల్లంపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన వీసీకి లబ్ధిదారులు హాజరై ప్రధాన మంత్రి ప్రసంగాన్ని శ్రద్ధతో ఆలకించారు. దేశంలో, రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలను ఏకతాటి పైకి తీసుకువచ్చి పథకాలను సమాజంలోని అన్నివర్గాలకు అందించాలనేది ప్రభుత్వ లక్ష్యమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. సమగ్ర సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి తోడ్పాటు అందించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ , శాస్త్రవేత్తలు నాగరాజు, తిరుపతి, రైతులు పాల్గొన్నారు.



మోదీ ప్రసంగం వీక్షిస్తున్న లబ్ధిదారులు

బస్సు ఆపలేదని డీఎంకు ఫిర్యాదు



ట్రాలీలో వెళ్తున్న మహిళలు

నెన్నెల(బెల్లంపల్లి): మండల కేంద్రంలోని కస్తూరి బా పాఠశాల సమీపంలో శనివారం సాయంత్రం చెయ్యొత్తి బస్సు ఆపాలని కోరగా సదరు డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడని మహిళా టీచర్లు మంచిర్యాల డిపో మేనేజర్ రవీంద్రనాథ్‌కు ఫిర్యాదు చేశారు. కుశ్నపల్లి నుంచి బెల్లంపల్లి వైపు వెళ్లే మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కేజీబీవీ సమీపంలో ఆపకుండా వెళ్లడంతో డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల కోసం ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినప్పటికీ మొదటి రోజే నిరాశకు గురిచేశాడని వాపోయారు. డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డ్రైవర్ నిర్లక్ష్యంతో తామంతా ప్రైవేట్ ట్రాలీలో వెళ్లినట్లు తెలిపారు.

మంత్రిని కలిసిన ఎంపీవోల సంఘం నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రి సీతక్కను శనివారం మండల పంచాయతీ అధికారుల సంఘం (ఎంపీవో) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వ్యవస్థలో నెలకొన్న సమస్యలు మంత్రికి వివరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేషాంజనేయులు, ప్రధాన కార్యదర్శి పర్వేజ్, ఉపాధ్యక్షులు శ్రీపతి బాపు, కందుకూరి రవిబాబు, అసోసియేట్ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

బస్సు నడపాలని ఆర్టీసీ ఎండీకి వినతి



సజ్జనార్‌కు పంపిన ట్వీట్

భీమారం(చెన్నూర్): మంచిర్యాల ఆర్టీసీ డిపో పరిధిలోని భీమారం మండలం దాంపూర్, రెడ్డిపల్లి, ధర్మారం గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ దాంపూర్ గ్రామానికి చెందిన సింగిరెడ్డి కిషోర్ శనివారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను ట్విట్టర్ ద్వారా కోరారు. మూడు గ్రామాల విద్యార్థులు విద్యను అభ్యసించేందుకు భీమారం వెళ్తారని వివరించారు. స్పందించిన సజ్జనార్ సమస్య పరిష్కరించాలని మంచిర్యాల డీఎంను ఆదేశించారు.

కొనసాగుతున్న హ్యాండ్ బాల్ పోటీలు

భీమారం(చెన్నూర్): మంచిర్యాల జిల్లా భీమారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు రెండో రోజు శనివారం కూడా కొనసాగాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన దాదాపు 400 మంది క్రీడాకారులు పోటీలో పాల్గొన్నారు. జాతీయ క్రీడాకారుడు అశోక్ బృందం క్రీడలను పర్యవేక్షించారు. పోటీలను తహసీల్దార్ విశ్వంభర్ పరిశీలించి క్రీడాకారులకు పలు సూచనలు చేశారు.



తలపడుతున్న ఆదిలాబాద్ వర్సెస్ వరంగల్ టీం